# జనసాగరం

కోట్లాది నీటి బిందువులు కలిసి మహా సాగరాలు ఉద్భవించాయి. అనేక లక్షల నక్షత్ర మండలాలు కలిస్తేనే కాని విశ్వమనేది లేదు.

విడిగా చూస్తే ఏ అక్షరానికీ విలువ లేకపోయినా కలిపి రాస్తే మహా కావ్యాలు పుట్టుకొచ్చాయి. గడ్డి పరకలను పెనవేసి కడితే, ఏనుగు కూడా తెంచుకోలేదు. పాతిక(★) రూపాయలు ఖర్చు పెడితే కిలో నెయ్యి దొరుకుతుంది.

ఏ ఒక్కడి వల్లా ఏ ఒక్కపనీ జరగదు. అలా జరుగుతుందనుకోవడం కేవలం భ్రమ. పది మందీ కలిసి పని చేస్తేనే కాని, ఏదీ రూపొందదు. మనిషి మనుగడ సంఘంతో రూపొందింది.... శాస్త్ర విజ్ఞానం ఇలానే అవతరించి అభివృద్ధి పొందుతూంది. సాంకేతిక విజ్ఞానం దినదినమూ కొత్త పుంతలు తొక్కుతూంది.

రాజకీయాలూ, మారణాయుధాలూ, యుద్ధాలూ... ఎన్నో బుర్రలు కలిసి అవతరించినవే.

శాంతిని నెలకొల్పడం, దారిద్ర్యాన్ని నిర్మూలించడం, మనిషి భావి జీవితాన్ని మహోన్నత శిఖరాలకి ఎక్కించడం - ఏ ఒక్కడి వల్లా జరగదు.

ప్రస్తుతం ఈ వసుధని పట్టుకుని పీడిస్తున్న పెనుభూతం - జనాభా పెరుగుదల. అణ్వస్త్రాల ప్రేలుడు కంటే మహా భయంకరమైన ఈ విస్తరణ ప్రపంచాన్ని పట్టుకుని దడిపిస్తోంది.

దీనికి కారణం ఏ ఒక్క జంటా కాదనుకోవడం పొరపాటే. ప్రతి జంటా ఈ మహా రాక్షసికి మరింత శక్తిని చేకూరుస్తోంది.

ప్రభుత్వాలెన్ని ప్రణాళికలు రూపొందించినా, ఆశలు చూపించినా, బెదిరించినా ప్రయోజనం లేకపోతూంది. రాముడు వారధి నిర్మాణం చేయిస్తూంటే, ఉడుత తన చేతనైన సహాయం చేసింది. ఇదీ అంతే. దేశం బాగుపడడానికి ప్రభుత్వం చేసే ప్రయత్నం ఒక్కటే చాలదు. ప్రతి వ్యక్తీ అంతో ఇంతో సహాయం చెయ్యాలి.

ప్రాజెక్ట్ ఏరియాలో పది రోజులు వళ్ళు హూనం చేసుకుని, పని పూర్తయిందనిపించాం- నేనూ, నా కొలీగ్ నిరంజన్. బంక్ హౌస్‌లో నుంచి సామాన్లు జీపులో పడేసి, సూర్యుడు కొండల మాటున దిగుతున్న వేళలో, కాలనీకి బయలుదేరాం. నలభై మైళ్ళు ఘాట్ రోడ్డమ్మట ప్రయాణం చేసి, కాలనీ చేరుకునేసరికి నిస్త్రాణ పట్టుకుంది. వళ్ళంతా దుమ్ము కొట్టుకు పోయింది. నిరంజన్ తన ఇంటి దగ్గర దిగిపోయాడు. నేనూ మా ఇంటి దగ్గర దిగి, మా సి.ఇ. తన సొంతానికి వాడుకున్న కొన్ని మైళ్ళ దూరాన్ని మా ప్రయాణానికి కాస్త అటూ, ఇటూ సర్దేసి, లాగ్ పుస్తకంలో సంతకం చేసి, జీప్ డ్రైవర్ని పంపించేశాను.

కసిదీరా వేడి నీళ్ళతో స్నానం చేసి, కబుర్లు చెపుతున్న శ్రీమతిని తనివితీరా చూస్తూ కడుపు నిండా భోజనం చేసి, బుగ్గన ఇంత వక్కపొడి దట్టించి సిగరెట్ ముట్టించి హాల్లో సోఫాలో కూలబడేసరికి రాత్రి పది గంటలయింది. శ్రీమతి వంటింట్లో పనులు చక్కబెడుతూంది.

కిటికీలో నుంచి బయటకు చూడసాగాను: చక్కటి వెన్నెల్లో సరస్సు వింత సోయగాలతో మెరిసిపోతూంది. అవతలి పక్కనున్న కొండల ఛాయలు వెండి చీరకు నల్లటి అంచుల్లా ఉన్నాయి. నిటారుగా పెరిగిన దేవదారు చెట్ల ఆకుల్లో నుంచి దూసు కొస్తూన్న వెన్నెల, నేల మీద వెండి ముగ్గులను పెడుతూంది. నవంబరు నెల చలి వెన్నెలతో బాటు కోరికలకి గిలిగింతలు పెడుతూంది.

తలుపు మీద ఎవరో తట్టిన చప్పుడు విని, లేచి వెళ్ళి తలుపు తీశాను. వరండాలో నిరంజన్ నిలబడి ఉన్నాడు.

"లోపలికి రా అన్నాను"

"ఫర్వాలేదు, భోజనమైందా?" నిరంజన్ అడిగాడు.

"నా వాలకం చూస్తూ తెలియటం లేదూ, భోజనం చేసిందీ లేందీ?"

"ఇవ్వాళ ప్రకృతి చాలా ఆహ్లాదకరంగా ఉంది కదూ?" నిరంజన్ ఒక్కసారిగా మాట మారుస్తూ అన్నాడు.

"ఈ కొండల్లో ప్రకృతి బాగుండనిదెప్పుడు?"

"అవుననుకో. లేక్ చుట్టూ నడిచివస్తే హాయిగాఉంటుందంటోంది మా ఆవిడ."

"ఈ షికారు చెయ్యడానికి నాకు వంట్లో ఓపిక లేదు. నీకు పుణ్యముంటుంది కాని, గట్టిగా అనకు. వింటే, మా ఆవిడ కూడా తయారవుతుంది!" బతిమాలే ధోరణిలో అన్నాను.

'నిన్ను రమ్మనటం లేదు. చాలా పొద్దుపోయిందికదా దుకాణాలు మూసేశారు!'

"దుకాణాలు ముయ్యడానికి, నీ షికారుకీ సంబంధమేముంది?" అర్థం కాక ప్రశ్నించాను.

"అదే, తిరిగి వచ్చిన తర్వాత ముసుగుతన్ని పడుకోవాలి!" నిరంజన్ నెమ్మదిగా, ఇబ్బందిగా అన్నాడు. అప్పటిక్కానీ నిరంజన్ ఎందుకు వచ్చిందీ తెలుసుకోలేకపోయాను.

లోపలికి వెళ్ళి అలమార్లో బట్టల వెనక చేతులు పెట్టి వెదికాను. అందిన నిరోధ్ పేకెట్ తీసుకొని వరండాలోకి తిరిగి వెళ్ళాను. లేక్‌కేసి చూస్తున్న నిరంజన్ చేతిలో పేకెట్ పెడ్తూ, "ఇందుకేనా?" అన్నాను నవ్వుతూ.

"థాంక్స్!" అంటూ నిరంజన్ వడివడిగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఇరుగు పొరుగుల వాళ్ళకి కాఫీ పొడుం, పంచదార, నెయ్యి వగైరా చిన్న చిన్న చేబదులిచ్చి పుచ్చుకోవడంలో మా శ్రీమతి మనోభావాలెలా ఉంటాయో నేనెప్పుడూ ఊహించలేదుకాని, ఆ రాత్రి నిరంజన్‌కి ఆ చిన్న సహాయం చేసి, ప్రభుత్వ కుటుంబ నియంత్రణ పథకానికి ఉడతా భక్తిగా సహకరించినందుకెంతో ఆనందపడిపోయాను.

దేశ క్షేమం కోసం ప్రవేశపెట్టబడే ప్రతి పథకానికీ, ప్రతి పౌరుడూ చేయూత నివ్వడానికి ప్రయత్నించాలి. ఒక్కొక్కప్పుడు ఆ ప్రయత్నం సఫలం కాకపోవచ్చును. కాని, మన ధర్మం నిర్వహించామన్న సంతృప్తి మిగులుతుంది.

పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న రోజులవి. అప్పుడు ఉద్యోగరీత్యా జమ్మూలో ఉంటున్నాను.

మా పెద్దవాడికప్పుడు నాలుగేళ్ళు. యుద్ధం మరో రెండు మూడు రోజుల తర్వాత మొదలవుతుందనగా, ఢిల్లీలో ఉంటున్న మా తోడల్లుడు శ్రీనగర్ పని మీద వెళ్ళి, తిరుగు దారిలో మా ఇంట దిగాడు. సరిహద్దు దగ్గర పరిస్థితి చాలా గంభీరంగా ఉండటం మూలాన, శ్రీమతిని, కుర్రాణ్ణి ఢిల్లీ పంపించేద్దామనుకొన్నాను. శ్రీమతి ససేమిరా కదలనంది. కుర్రాడికి వాళ్ళ దొడ్డమ్మ దగ్గర అలవాటే కదా అని వాణ్ణి ఆయనతో ఢిల్లీ పంపించేశాము.

పౌర రక్షణ నిబంధనల ప్రకారం మేముంటున్న ఇంటి ఆవరణలో ఇంటికి

దూరంగా, ఇంగ్లీషు 'ఎల్' ఆకారంలో ట్రెంచ్ తవ్వించాను. రెండున్నర అడుగుల వెడల్పు, నాలుగున్నర అడుగుల లోతు. ఒకపక్కన ఆరడుగుల పొడవు. మరో పక్కన ఎనిమిదడుగుల పొడవు. రెండు పక్కల నుంచి లోపలికి దిగడానికి మెట్లు. మెట్లున్నంత మేరకు వదిలి, మిగిలిన భాగమంతా పైన చిన్న చిన్న కర్రలతోటీ, కొమ్మలతోటీ కప్పి, పైన మట్టి వేయించాను.

డిసెంబరు మూడున సూర్యుడస్తమించినా ఆకాశపుటంచులు ఎర్రగానే ఉన్నాయి. బాంబుల వర్షానికి ఇళ్ళూ, గుండెలు అదరసాగాయి. భయం భయంగా వెలుగుతున్న కొవ్వొత్తి వెలుతుర్లో రాత్రంతా ఇబ్బందిగా గడిపేశాం. నాలుగో తారీఖు ఉదయం ఆరింటికి జమ్మూ ఆకాశంలో మొదటి విమాన యుద్ధం జరిగింది. బయటికెళ్ళి ట్రెంచ్‌లో కూర్చోవాలన్న సంగతి మరచి నేనూ, శ్రీమతీ మంచం క్రింద దూరాం. ఆల్ క్లియరెన్స్ సైరన్ విన్న తర్వాత బయటకు వచ్చాం. తర్వాత ప్రతి రెండు మూడు గంటలకొకసారి విమాన దాడులు జరుగుతూనే వచ్చాయి. మాటి మాటికీ ట్రెంచ్‌లో తలదాచుకొనేవాళ్ళం.

ఆ సాయంత్రం ట్రెంచ్‌లో సరంజామా జారవేశాను. ఒక డజను బిస్కట్ పాకెట్లు, ఒక పెద్ద ఫ్లాస్కు నిండా వేడినీళ్ళు, నెస్‌కేఫ్ కాఫీ పొడరూ, మిల్క్ పొడరూ డబ్బా, కప్పులూ, సాసర్లు - దుక్కల్లాంటి నాలుగు జతల బట్టలూ, పైన మరో అరవై రూపాయలూ తగలెట్టి, చౌక బేరం అని మురిసిపోతూ మా ఆవిడ కొన్న స్టీలు బిందెతో నీళ్ళూ, టార్చి సెల్లూ కొవ్వొత్తులూ, ఒక జంబుఖానా వగైరా వగైరాలు.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటల ప్రాంతాన ఎయిర్ రెయిడ్ సిగ్నల్ వినవచ్చింది. ఏనుగు నిద్ర పోతున్న మేము లేచి, పరుగెత్తి ట్రెంచ్‌లో దిగాం. కిందకు దిగిన తరవాత, ఒక్కసారి టార్చి వేసి చూసి, వెంటనే ఆర్పేశాను. తేళ్ళూ అవీ ఉంటాయని భయం.

అంతా కటిక చీకటి. సజీవంగా సమాధి చెయ్యబడ్డట్టుంది. రాచపీనుగుకి తోడన్నట్లుగా శ్రీమతి నన్నానుకుని పక్కగా కూర్చుంది. అంతలోనే విమానాల హోరూ, చెవులు చిల్లులు పడిపోయేటట్లు పేలుతున్న బాంబుల చప్పుళ్ళూ మమ్మల్ని అదరకొట్టేశాయి. (తావి నది మీద వూరికి మధ్యగా ఉన్న వంతెనని ధ్వంసం చెయ్యాలన్న శత్రు విమానాల యత్నాల్ని మన విమానాలు ప్రతిఘటించాయని మరునాడు ఉదయం తెలిసి వచ్చింది).

శ్రీమతి భయంతో నన్ను కరుచుకుపోయింది. అయిదు నిముషాల పాటు ప్రళయ కాల రుద్రుడిలా గర్జించిన ఆకాశం, ఒక్కసారిగా నిశ్శబ్దమై పోయింది. ఆ అయిదు నిమిషాలూ అయిదు యుగాలుగా గడిచిపోయాయి. ఆ రాత్రి మొత్తం మీద నాలుగు మార్లు విమాన దాడులు జరిగాయి. రాత్రంతా ట్రెంచ్‌లోనే ఉండిపోయాం.

భయమనేది కూడా, కోరికల్ని ఎలా రెచ్చకొడుతుందో, ఆ రాత్రి తెలియవచ్చింది.

అంత సరంజామానీ ట్రెంచ్‌లో చేరవేసిన నేను దాని అవసరం వస్తుందని ఊహించ లేకపోయాను.

మా రెండోవాణ్ణి అప్పుడప్పుడూ ముద్దుగా ట్రెంచిగాడని పిలుస్తూ ఉంటాం. అర్థం

కాక వాడు మా వైపు చూస్తే నేనూ, శ్రీమతి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటాం.

పని తప్పించుకునేవాడు తప్పు చెయ్యడమంటూ జరగదు. ప్రయత్నం చేసేవాడే, తప్పు కూడా చేస్తాడు. మరో రెండేళ్ళాగి, రెండో సంతానం అనుకున్నాం. కాని మా ప్లాన్ ఈ విధంగా బెడిసి కొట్టడంతో మరో ఆలోచన లేకుండా ఆపరేషన్ చేయించుకున్నాను.

మీకిదంతా నవ్వుతాలుగా ఉండొచ్చు. ప్రస్తుతం మన జనాభా 600 (★) మిలియన్లు. మనకేం పట్టిందని శ్రీమంతులూ, రెండు చేతులకి మరో రెండు చేతులుంటే మరో నాలుగు డబ్బులు చూడవచ్చుననే కార్మిక వర్గం భ్రమా, సెక్సుకు తప్ప మరే వినోదానికైనా డబ్బుండాలి కదా అనే మధ్యతరగతి వాడి ఫిలాసఫీ, ముసలివారి కన్నుల పండుగ కోసం, తృప్తి కోసం మనవలకి చిన్న వయస్సుల్లోనే జరిగే పెళ్ళిళ్లు, వెర్రి వేషాలు చూపిస్తున్న సినిమాల ప్రభావంవల్లా, వెర్రి తలలు వేస్తున్న నాగరికత ప్రభావం వల్లా, చదువు పూర్తికాక మునుపే సంసార సుఖాలు చూస్తున్న యువతరం, -ఇలా అనేక కారణాల మూలంగా మరో దశాబ్దంలోగా జనాభా 800 (★) మిలియన్ల దాకా పెరిగిపోతుంది.

రోగ నివారణ పథకాలూ, మంచినీటి సరఫరా చాలా అభివృద్ధి పొందాయి. ఫలితంగా ఆయుః ప్రమాణం పెరిగింది. మరణాల సంఖ్య తగ్గడంతో, జనాభా పెరగడం కొంతవరకూ సహజం. అలాగని చావుని కోరే సమాజం సమాజం కాదు. అందుకని మన చేతిలో ఉన్నది, మన అదుపులో ఉంచుకోవచ్చునని నిరూపించ బడినదీ ఏమిటంటే జననాల సంఖ్య.

పృథివిని ముంచెత్తే ఈ జనసాగరాన్ని అరికట్టాలి.

తల కింద కొరివి పెట్టడానికి, తను సంపాదించిన ఆస్తి అనుభవించడానికీ, మగ పిల్లలే ఉండాలని ఎక్కడా లేదు. ఆడపిల్లలు మట్టుకు ఈ పని చెయ్యలేరా? ఆడపిల్లలే ఉన్నవాళ్ళు, ఈ విషయం ఆలోచించండి. తల్లో పువ్వులు పెట్టి మురిసి పోవడానికి కూతుళ్ళే ఉండక్కర్లేదు. ఆ పెట్టే పువ్వుల్ని కోడళ్ళకు పెట్టి సరదా తీర్చుకో వచ్చు. అందరూ మగపిల్లలే ఉన్నవాళ్ళు, ఈ విషయం ఆలోచించండి.

పది మంది పిల్లల్ని కని, వాళ్ళకి రెండు పూటలూ తిండి పెట్టలేక, చదువులు చెప్పించలేక, పెళ్ళిళ్ళు చెయ్యలేక, నానా అగచాట్లు పడే బదులు, ఒకరిద్దర్నే కని, వాళ్ళని నిక్షేపంలా పెంచడం చాలా హాయి. మంది ఎక్కువైన కొద్దీ మజ్జిగ పలచబడు తుంది కదా!

తక్కువ బిడ్డలున్న తల్లి ఆరోగ్యం చక్కగా ఉంటుంది.

వన సంపద, ఖనిజ సంపద, భూగర్భ నిక్షిప్తమైన ఇంధనాలు, తక్కువ జనాభా ఉన్న దేశంలో ఎక్కువ కాలం ఉంటాయి. అటువంటి దేశం సుభిక్షంగా ఉంటుంది.

దేశం కూడా తల్లి లాంటిదే మరి.

*(★ ఈ సంకలనం సమయానికి అంటే 1998లో, నెయ్యి కిలో 150 రూపాయాలు. జనాభా 900 మిలియన్ల ప్లస్ - రచయిత)*

*(ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రిక : 14-3-1979)*